క్లుప్తంగా

శ్రీశైలం, బ్రహ్మగుండం క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

డోన్ టౌన్: శివరాత్రి పర్వ దినాన్ని పురస్కరించుకుని డోన్ పట్టణం నుంచి శ్రీశైలం, బ్రహ్మగుండం క్షేత్రాలకు 20వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ శశిభూషణ్ శనివారం తెలిపారు. శ్రీశైలానికి 20 బస్సులు, బ్రహ్మగుండానికి 10 బస్సులు ఏర్పాటు చేసామన్నారు. ప్రస్తుతం డీజిల్ రేట్లు పెరిగినా ప్రయాణికులకు గతేడాది చార్జీలే వసూలు చేస్తామన్నారు. అంతే కాకుండ శ్రీశైలం వెళ్లే భక్తులకు రిజర్వేషన్ చేసుకునే సమయంలో దర్శనం కోసం ఆన్‌లైన్ టిక్కెట్లు కూడా రిజర్వేషన్ ఇక్కడే చేయించుకోవచ్చని తెలిపారు. డోన్ నుంచి శ్రీశైలంకు రూ.430, కర్నూలు నుంచి రూ.350, కర్నూలు నుంచి వెంకటాపురం వరకు అయితే రూ.150 లకే ప్రయాణించవచ్చని వివరించారు. దేవస్థానం నిర్ణయించిన ధరలకే దర్శనంలో అతి శీఘ్ర దర్శనం, శీఘ్ర దర్శనం, స్పర్శ దర్శనం టిక్కెట్లు సౌకర్యం కూడా కల్పించామని, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆలయాభివృద్ధికి ముంబై భక్తుల విరాళం



నగదు అందజేస్తున్న దాతలు

బనగానపల్లెరూరల్: మండలంలోని నందవరంలో వెలసిన శ్రీ చౌడేశ్వరీదేవి ఆలయ అభివృద్ధికి శనివారం ముంబైకి చెందిన జే.హనుమంతు కుటుంబ సభ్యులు రూ.50,001 విరాళాన్ని ఆలయ అర్చకుడు ప్రదీప్‌కుమార్‌శర్మకు అందజేశారు. అర్చకులు దాతలను సన్మానించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

సోషల్ మీడియాలో హద్దు మీరితే చర్యలు

కొలిమిగుండ్ల: ఇటీవల కాలంలో కొంత మంది సోషల్ మీడియాలో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, హద్దు మీరితే చర్యలు తప్పవని ఎస్ఐ రమేష్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొంత మంది ఫేస్‌బుక్‌తో పాటు ఇతర సోషల్ మీడియాల్లో ఒకరికొకరు వ్యతిరేఖంగా రెచ్చగొట్టేలా పోస్టింగ్‌లు పెడుతున్నారన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగించేలా ఉన్నాయని, వీటిమీద పోలీసుల నిఘా ఉంటుందన్నారు. రెచ్చగొట్టే పోస్టులు పెట్టేవారిని వదిలిపెట్టే ప్రసక్తి లేదని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

19 నుంచి రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని పెట్నికోటలో శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గుండుమల్లేశ్వరస్వామి క్రీడా మైదానంలో జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఉదయ్‌భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 19నుంచి రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి రోజు పాలపళ్ల సైజు విభాగం పోటీలు నిర్వహిస్తామన్నారు. గెలుపొందిన ఎడ్ల యజమానులకు దాతల సహకారంతో వరుసగా రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు అందిస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా 20వ తేదీన నిర్వహించే యుకేటగిరి విభాగం పోటీల్లో గెలుపొందిన ఎడ్ల యజమానులకు వరుసగా రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు అందించనున్నట్లు వివరించారు.

రాష్ట్ర మహాసభల పోస్టర్లు విడుదల

డోన్ టౌన్: శ్రీకాకుళంలో జరిగే ఐఎఫ్‌టీయూ 9వ రాష్ట్ర మహాసభల పోస్టర్లను శనివారం స్థానిక కార్యాలయంలో నాయకులు విడుదల చేశారు. ప్రజాతంత్ర విప్లవ లక్ష్యంగా 1978లో ఏర్పడిన ఐఎఫ్‌టీయూ కార్మికుల పక్షాన పోరాడుతూనే ఉందని ఈ సందర్భంగా ఆ సంఘం నంద్యాల జిల్లా కార్యదర్శి ధర్మారం రంగ నాయకులు గుర్తు చేశారు. కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు రాజు, పీడీఎస్‌యూ కార్యదర్శి పవన్, ఐఎఫ్‌టీయూ నాయకులు మల్లికార్జున, శ్రీరాములు, దాసు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించేందుకు శ్రీశైల దేవస్థానం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా శనివారం నిత్య కళారాధన వేదిక వద్ద నంద్యాలకు చెందిన శ్రీసాయి నాట్యాంజలి ఫైన్ ఆర్ట్స్ వారి కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. అలాగే పుష్కరిణి వద్ద శ్రీకాళహస్తికి చెందిన సుకన్య బృందం వారి భరతనాట్యం, తిరుపూరుకు చెందిన గోదా నరసింహారావు బృందం వారి భక్తిరంజని, శ్రీకాకుళంకు చెందిన భారతి రమేష్ వారి కచేరి భక్తులను ఆకట్టుకున్నాయి. శివదీక్షా శిబిరాల వద్ద హైదరాబాద్‌కు చెందిన క్రాంతి, బృందం కూచిపూడి నృత్యప్రదర్శన, ప్రకాశం జిల్లాకు చెందిన లక్ష్మీరెడ్డి, పట్టాభిరామ కళానాట్య మండలి వారి వీరబ్రహ్మేంద్ర స్వామి చరిత్ర పౌరాణిక నాటకం, విజయవాడకు చెందిన శ్రీనివాస నాట్య మండలి శివలీలలు, మోహినీ విజయం పౌరాణిక నాటకాలు అలరించాయి.

సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం

- అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల వర్తింపు
- ప్రజలకు జరిగిన మేలును గృహసారథులు, కన్వీనర్లు వివరించాలి
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు అఫ్జల్ ఖాన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: ప్రజా సంక్షేమం, అభివృద్ధి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. పార్టీలు, కులమతాలు, వర్గాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని, ప్రతి కుటుంబానికి ప్రభుత్వం నుంచి జరిగిన మేలును గృహసారథులు, కన్వీనర్లు బాధ్యతగా వివరించాలని పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎమ్మార్వో కార్యాలయ సమీపాన క్రీడామైదానంలో శనివారం సాయంత్రం ఎమ్మెల్యే అధ్యక్షతన జరిగిన గృహసారథులు, కన్వీనర్ల సమావేశానికి బనగానపల్లె నియోజకవర్గ పరిశీలికుడు అఫ్జల్ ఖాన్ హాజరయ్యారు. ముందుగా ఎమ్మెల్యే కాటసాని తనయుడు కాటసాని ఓబులరెడ్డి, సోదరులు కాటసాని తిరుపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ మహమ్మద్‌హుస్సేన్, అబ్దుల్‌ఫైజ్, గుండం శేషిరెడ్డి, కోడూరు రామచంద్రారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మండల కన్వీనర్ గుండం నాగేశ్వరరెడ్డి, జనార్దన్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, అనిల్, ఖానీక్, సురేష్, శివరామిరెడ్డి తదితరులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు వర్తిస్తున్న తీరు... లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమచేస్తున్న విధానం... పట్టణంలో జరిగిని అభివృద్ధిని విశదీకరించారు. అనంతరం ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ ప్రతి సచివాలయానికి ముగ్గురు కన్వీనర్లు, ప్రతి 50 ఇళ్లకు ఇద్దరూ గృహసారథులను నియమించామని, ప్రజలతో మమేకం కావాలన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను కూడా అమలు చేయకుండా ప్రజలను మభ్యపెట్టిన విషయాన్ని, మన ప్రభుత్వం 95 శాతానికిపైగా హామీలను నెరవేర్చిన తీరును ప్రజలకు వివరించాలని చెప్పారు. ప్రభుత్వం అమలు పరుస్తున్న 32 సంక్షేమ పథకాలు ప్రయోజనాలు, జరిగిన... జరుగుతున్న అభివృద్ధిని ప్రజలకు వివరించాలని సూచించారు. వైఎస్సార్ సంక్షేమ పథకాలు అభివృద్ధి పథకల గురించి టీడీపీ నాయకులు కూడా విమర్శించలేని స్థితిలో ఉన్నారని, స్వార్థరాజకీయాల కోసం కొందరు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టాలన్నారు. నియోజకవర్గంలో జరిగిన... జరుగుతున్న అభివృద్ధి టీడీపీ నాయకులకు మాత్రం కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. రూ. 66 కోట్లతో బనగానపల్లెలో బైపాస్ రోడ్డుకు నిధులు మంజూరైందని, ఇందుకు భూసేకరణ కార్యక్రమం కూడా పూర్తయిందన్నారు. రూ.12 కోట్లతో పసుపల సింగల్ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చేందుకు నిధులు మంజూరయ్యాయన్నారు. పట్టణంలో శ్మశానవాటిక ప్రహరీ నిర్మించేందుకు రూ.69లక్షలు మంజూరయ్యాయన్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి గృహ సారథులు, కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లీ ప్రభుత్వం ద్వారా అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించుకునేలా పనిచేయాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కోరారు. అనంతరం గృహసారథులు, కన్వీనర్లకు మా నమ్మకం నీవే జగనన్న మెటీరియల్ బ్యాగ్‌లను అఫ్జల్ ఖాన్‌తో కలిసి అందజేశారు.

బీసీకి... ప్రచార యావ చాలా ఎక్కువ!

టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి ప్రచార యావ చాలా ఎక్కువని, గోరవంత సాయం చేస్తూ కొండంత ప్రచారం చేయించుకోవడంలో ఆయన దిట్ట అని ఎద్దేవా చేశారు. పెళ్లికానుక పేరుతో చేసిన గోరంత సాయానికి....పత్రికల్లో వచ్చిన విస్తృత ప్రచారానికి ఏమైనా పొంతన ఉంటుందా అని ప్రశ్నించారు. సొంత అన్న బీసీ బాలతిమ్మరెడ్డికి ఇవ్వాల్సిన డబ్బు ఇవ్వకపోవడంతో ఆత్మహత్యకు పాల్పడిన విషయం ఎవరికి తెలియందని, బీసీ జనార్ధన్‌రెడ్డికి ఏ మాత్రం సేవా గుణం ఉందో ఇట్టే అర్థమవుతుందన్నారు. ముస్లిం సోదరులకు చేసిన అన్నదానం, దర్గాలకు ఇచ్చిన పూలపై కూడా ప్రచారం పొందడం సిగ్గుచేటన్నారు. ఈ విధమైన ప్రచారంతో పేదలను రోడ్డుకు ఈడ్చడమే అని ఆందోళన వ్యక్తం చేశారు. తామూ పేదలకు సహాయసహకారాలు అందజేస్తుంటామని, అయితే ప్రచారం కోసం పాకులాడమన్నారు.

వెన్నుపోటు బాబుకు... చరమగీతం పాడాలి

దివంగత ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీని వెన్నుపోటు బాబు ఎలా లాక్కున్నారో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసుని, రానున్న ఎన్నికల్లో చరమగీతం పాడి బాబును ఇంటికి పంపాలని బనగానపల్లె నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకులు అఫ్జల్‌ఖాన్ పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మేలును ప్రజలకు వివరించడంలో గృహసారథులు, కన్వీనర్ల పాత్ర కీలకమని, బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి గడపను తట్టాలని, ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి చేకూరిని లబ్ధిని వివరించడంతోపాటు ప్రభుత్వ లక్ష్యాన్ని తెలుపాలన్నారు. పేదరికం ఉండకూడదన్న గట్టి నిర్ణయంతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా అందజేస్తున్న విషయాన్ని ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు.

పట్టుబడిన వాహనాలకు నేడు వేలం

డోన్ టౌన్: అక్రమ మద్యం రవాణ చేస్తూ పట్టుబడిన వాహనాలకు ఆదివారం జాతీయ రహదారి సమీపానున్న డోన్ రూరల్ పోలీసు స్టేషన్‌లో వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు సీఐ శేషయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ, రూరల్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలలోని చేపట్టిన దాడుల్లో పట్టుబడిన 12 బైకులు, రెండు కార్లు, ఒక ఆటోను వేలం వేస్తున్నామన్నారు. వాహనాన్ని దక్కించుకున్నవారు వేలం మొత్తంతో పాటు అదనంగా జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

ప్యాపిలిలో....

ప్యాపిలి: నాటుసారా, మద్యం అక్రమ రవాణాలో భాగంగా పట్టుబడిన ద్విచక్రవాహనాలను ఆదివా రం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో వేలంపాట నిర్వహించి విక్రయించనున్నట్లు ప్యాపిలి ఎస్ఐ సీఎం రాకేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే వేలంపాటలో ద్విచక్ర వాహనాన్ని దక్కించుకున్న వ్యక్తులు అదనంగా జీఎస్టీ కూడా చెల్లించాల్సి ఉంటుందన్నారు. మొత్తం 11 ద్విచక్రవాహనాలకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వేంకటరెడ్డి తిరునాల ప్రారంభం

ప్యాపిలి: పట్టణంలోని స్థానిక వెంకటరెడ్డి కాలనీలో వెలసిన అవధూత వేంకటరెడ్డి ఆలయ ప్రాంగణంలో శనివారం తిరునాల ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో వెలసిన దుకాణాల వద్ద మహిళలు, చిన్నపిల్లలతో సందడి నెలకొంది. ఆదివారం సాయంత్రం నిర్వహించే ముగింపు వేడుకలకు కనుల పండువగా జరుగనున్నాయి.

లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం



కోవెలకుంట్ల కోర్టులో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న న్యాయమూర్తి అబ్దుల్ రెహమాన్

కోవెలకుంట్ల:లోక్ అదాలత్ కార్యక్రమం ద్వారా కక్షిదారులకు సత్వర న్యాయం అందుతుందని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి అబ్దుల్ రెహమాన్ అన్నారు. శనివారం స్థానిక కోర్టులో లోక్ అదాలత్ నిర్వహించారు. కోవెలకుంట్ల పోలీస్ సర్కిల్ పరిధిలోని గ్రామాల్లో రాజీ అయిన 35 క్రిమినల్, క్రిమినల్ అడ్మిషన్ 21, సివిల్, మెయింటినెన్స్ ఒక్కొక్కటి, ఎస్టీసీ 223 కేసులను పరిష్కరించారు. ఆయా కేసుల్లో రూ. 5.36 లక్షల జరిమానా విధించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ రాజీయే రాజమార్గమన్నారు. ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులు లోక్ అదాలత్‌తో పరిష్కామవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు ఆరికట్ల మల్లికార్జునరెడ్డి, నరసింహులు, శ్రీనివాసులు, తిరుపాలు, ఓబులేసు పాల్గొన్నారు.

రాజీమార్గం ఉత్తమం



బనగానపల్లె జూనియర్ సివిల్ కోర్టులో కక్షిదారులతో మాట్లాడుతున్న జడ్జి కిశోర్‌కుమార్

బనగానపల్లెరూరల్: కేసుల పరిష్కారంలో ఇరువర్గాలకు చేందిన కక్షిదారులు రాజీ మార్గంలో పరిష్కారించుకోవడమే ఉత్తమమని బనగానపల్లె జూనియర్ సివిల్ జడ్జి కిశోర్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో జాతీయ మెగా లోక్‌అదాలత్ కార్యక్రమం జరిగింది. మొత్తం 216 కేసులు పరిష్కారంకాగ క్రిమినల్ 67, మనీ సివిల్ దావాలు రెండు, సివిల్ ట్రైల్ కేసెస్ మూడు, చెక్కుబౌన్స్ ఒక కేసు, ప్రీలిటికేషన్స్ ఆరు, సమ్మరీ ట్రైల్ కేసెస్ 134 కేసులు పరిష్కారమైనట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. సమ్మరీ ట్రైల్ కేసులకు రూ.56,700లు జరిమానా, సివిల్ దావాకు సంబంధించి రూ.1,91,000 దావా పరిష్కారమైందని తెలిపారు. అదేవిధంగా చెక్కు బౌన్స్ కేసులో రూ.3.65 లక్షలు పీఎల్‌సీ మ్యాటర్ రూ.95,400ల విలువ కలిగిన కేసులు పరిష్కారమైన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ మెంబరు టి.వెంకటేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్నాథ్‌రెడ్డి సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

మళ్లీ రోడ్డుపైకి చేరుతున్న వ్యాపారాలు!

కొలిమిగుండ్ల: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపైకి మళ్లీ ఒక్కొక్కరుగా చేరుకొని వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. రోడ్డు అస్తవ్యస్థంతో పాటు ఇరుకుగా మారడంతో ఏడాది క్రితం తేరు మిద్దె సమీపం నుంచి ఆర్టీసీ బస్టాండ్ మీదుగా ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు తొలగించి 14 మీటర్ల మేర విశాలంగా సీసీ రోడ్డు నిర్మించారు. క్రమేనా వ్యాపారులు తోపుడు బండ్లతో పాటు దుకాణాలు తీసుకొచ్చి ఏకంగా రోడ్డుపైనే ఏర్పాటు చేస్తున్నారు. రోడ్డు విశాలంగా విస్తరించినా మళ్లీ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. ఓవైపు రోడ్డుపై వ్యాపారాలతో పాటు ఇష్టానుసారంగా బైక్‌లు నిలుపుతున్న కారణంగా రవాణ చేసే వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో వివిధ డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులు తిప్పుకునేందుకు వీలు లేకుండా అడ్డగోలుగా బైక్‌లు, కార్లు, ఆటోలు పార్కింగ్ చేయడంతో ఆర్టీసీ డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకొని ప్రధాన రహదారిపై వ్యాపారాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

మీ పాత్ర కీలకం !

- గృహసారథులు, కన్వీనర్లు ప్రజలతో మమేకం కావాలి
- ప్రభుత్వ లక్ష్యాన్ని...ప్రజలకు జరిగిన మేలును వివరించాలి
- డోన్ నియోజకవర్గ పరిశీలకుడు మురళీధర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ పార్టీ పరిశీలకులు కోన మురళీధర్‌రెడ్డి

డోన్: ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని డోన్ నియోజకవర్గ పార్టీ పరిశీలకులు కోన మురళీధర్‌రెడ్డి, రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు తెలిపారు. ప్రభుత్వ లక్ష్యం.. మూడేళ్ల పాలనలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధిని ప్రజలకు వివరించడంలో గృహ సారథులు, కన్వీనర్ల పాత్ర చాలా కీలకమన్నారు. స్థానిక చాందిని ఫంక్షన్ హాల్‌లో డోన్ టౌన్ పరిధిలోని 16 సచివాలయాల గృహ సారథులు, సచివాలయాల కన్వీనర్లతో కోన మురళీధర్ రెడ్డి, శ్రీరాములు నిర్వహించిన సమావేశానికి ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్ కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, మండల సచివాలయాల కన్వీనర్ మల్లెంపల్లె రామచంద్రుడు, పట్టణ గృహసారథులు, సచివాలయాల కన్వీనర్ కురుకుందు హరి, మునిసిపల్ వైస్‌చైర్మన్ జాకీర్ హుసేన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కోన మురళీధర్‌రెడ్డి, శ్రీరాములు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి ప్రజల మధ్య ఆర్థిక అసమానతలను తొలగించేందుకు అనేక పథకాలను ప్రవేశపెట్టిన ఘనత ఒక్క ఏపీ ముఖ్యమంత్రికే దక్కిందన్నారు. ప్రజలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న నమ్మకాన్నివమ్ము చేయకుండా అధికారంలోకి రాకముందు ఏమి హామీలిచ్చారో తెలుపుతూ వచ్చిన తర్వాత నెరవేర్చిన విషయాన్ని కన్వీనర్లు, గృహసారథులు ప్రజలకు బాధ్యతగా తెలియజేయాలని సూచించారు.

ప్రజల మధ్యనే ఎమ్మెల్యేలు, మంత్రులు

నిజాయితీగా, పారదర్శకంగా రాష్ట్రాన్ని పాలిస్తున్నందునే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.... ఎమ్మెల్యేలు, మంత్రులను నిత్యం ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని ఆదేశించిన విషయాన్ని కోన మురళీధర్‌రెడ్డి, శ్రీరాములు గుర్తుచేశారు. ఎప్పటికప్పుడు సరికొత్త నిర్ణయాలు తీసుకుంటూ ఆ నిర్ణయాల మూలంగా సమాజంలోని అన్నివర్గాల ప్రజలకు మేలు జరిగే విధంగా పరిపాలన సాగిస్తున్న జననేతకు ఎవరూ సాటి రారని పేర్కొన్నారు. మా నమ్మకం నువ్వే జగనన్న అనే సరికొత్త నినాదంతో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు తమ పరిధిలోని ఇళ్లవద్దకు వెళ్లి ప్రభుత్వం చేపట్టిన పథకాలు, అమలు చేస్తున్న అభివృద్ధి పనులు గురించి వివరించాలని పిలుపునిచ్చారు.

వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించండి

వైఎస్సార్‌సీపీ బలపరుస్తున్న పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నుపూస రవీంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోన మురళీధర్‌రడ్డి, శ్రీరాములు పట్టభద్రులకు పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులు ఐకమత్యంగా రవీంద్రారెడ్డి గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా రవీంద్రారెడ్డి ప్రచారానికి సంబంధించి కరపత్రాలను వారు విడుదల చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ వెన్నుపూస నరేష్‌రెడ్డి, నాయకులు సాయికిరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

బనగానపల్లెరూరల్: మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని టంగుటూరు గ్రామానికి చెందిన పి. బాలరాజు(57) కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ రామాంజనేయరెడ్డి శనివారం తెలిపారు. మృతుడు శుక్రవారం తన భార్య పెద్దక్కతో కలిసి మోటర్ సైకిల్‌పై బీరవోలు గ్రామానికి వెళ్లీ తిరిగి స్వగ్రామం వస్తుండగా నందవరం ఎస్ఆర్‌బీసీ కాల్వ మలుపు వద్ద ఎదురుగా గూడ్స్ ఆటో ఢీకొట్టింది. దీంతో బాలరాజును మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.అయితే చికిత్స నుంచి కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి భార్య పెద్దక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

13న అప్రెంట్‌షిప్ మేళా

డోన్ టౌన్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 13 వ తేదీన ఐటీఐ పాసైన విద్యార్థులకు ప్రధానమంత్రి జాతీయ అప్రెంటీషిప్ మేళాను నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్స్‌పాల్ రాయపరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో ఎంపికైన వారికి కంపెనీ స్టైఫండ్ చెల్లిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ముగిసిన శ్రీకాశిరెడ్డి నాయన ఆరాధనోత్సవాలు



కాశిరెడ్డి నాయనకు ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

డోన్ టౌన్: మండల పరిధిలోని ఓబులాపురం సమీపాన జాతీయ రహదారి ప్రక్కన వెలసిన శ్రీకాశిరెడ్డి నాయన 18వ ఆరాధనోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. స్వామివారి మూల విరాట్‌కు అభిషేకాలు, అర్చనలు, మంగళహారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే అన్నపూర్ణేశ్వరి దేవికి, ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు కాశిరెడ్డి నాయనను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆరాధన ఉత్సవాలను పురస్కరించుకొని నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అదేవిధంగా చెక్క భజన పోటీలు, న్యూకేటగిరి ఎద్దులకు రాతి దూలం పోటీలు, గుండు ఎత్తు పందెం పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఉత్సవాల ముగింపురోజు రాత్రి శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాములవారి జీవిత చరిత్ర నాటకాన్ని ప్రదర్శించారు.

శ్రీమద్దిలేటయ్య ఆదాయం రూ.7,76,687



స్వామివారికి బంగారం విరాళం అందజేస్తున్న దాతలు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం శివారులో వెలసిన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయానికి శనివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.సేవా టికెట్స్, లడ్డు ప్రసాదం, గదుల బుకింగ్, అన్నదానం చందాలు, గండ దీపం,విరాళాలు,కల్యాణకట్ట తదితర సేవల ద్వారా రూ. రూ.7,76,687 ఆదాయం వచ్చినట్లు ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ సీతారామచంద్రుడు తెలిపారు. స్వామివారికి వైఎస్సార్ కడప జిల్లా జమ్ములమడుగుకు చెందిన గాలిగారి వెంకట సుధామణి, మధన ప్రసాద్ దంపతులు 28 గ్రాముల బంగారం, కర్నూలు టౌన్‌కు చెందిన మణికంత ట్రావెల్స్ నిర్వాహకులు 520 గ్రాముల వెండిని విరాళంగా అందజేశారు. స్వామి, అమ్మవార్ల ప్రత్యేక పూజల అనంతరం దాతలకు తీర్థ ప్రసాదాలు అందజేసి పట్టు వస్త్రంతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు లక్ష్మణ్ నాయుడు, తిమ్మారెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నరసింహస్వామి గ్రామోత్సవం

మహానంది: మండలంలోని గాజులపల్లెలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి వార్ల గ్రామోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఉత్సవమూర్తులను గ్రామంలో ఊరేగించారు. లోక కల్యాణం కోసం నరసింహస్వామి మాలధారులు భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. స్వామివార్ల దంపతులకు అభిషేకం, అర్చన చేపట్టారు.

ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన సీఎం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి

బేతంచెర్ల: ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దక్కిందని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యులు మూర్తుజావలీ, మండల నాయకులు బాబుల్ రెడ్డి, బుగ్గన చంద్రారెడ్డి తెలిపారు. పట్టణంలోని అమ్మవారిశాల వెనక శనివారం సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థిక బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సారథ్యంలో డోన్ నియోజవర్గం అన్నివిధాలుగా అభివృద్ధి జరుగుతుందన్నారు. రూ. 330 కోట్లతో వాటర్ గ్రిడ్ పథకం కింద గోరుకల్లు రిజర్వాయర్ నుంచి ఇంటింటికీ స్వచ్ఛమైన నీరు అందించే పనులు కొనసాగుతున్నాయన్నారు. అదేవిధంగా మూత బడిన పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీ పునఃరుద్ధరణకు మంత్రి కృషి చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు,పేదలకు చేకూరిన లబ్ధి గురించి కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందజేస్తున్న విషయాన్ని ప్రజలు అర్థమయ్యేలా విశదీకరించాలని సూచించారు. ఆయా కుటుంబాలకు మూడున్నరేళ్లలో ప్రభుత్వం నుంచి చేకూరిన లబ్ధిని వివరించి 'మా నమ్మకం నువ్వే జగనన్న' స్టిక్కర్‌ను లబ్ధిదారుల ఇళ్లకు అతికించాలని సూచించారు. కార్యక్రమంలో వాల్మీకి ఫెడరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మురళీ కృష్ణ, జెడ్పీటీసీ శివలక్ష్మమ్మ, సింగిల్ విండో అధ్యక్షుడు నారాయణ, వైఎస్ ఎంపీపీ రంగస్వామి, నగర పంచాయతీ వైస్ చైర్మన్ నాగవెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు గుమ్మగాల్ల రాజు, వెంకటేశ్వర్లు, శ్రీరాములు, కౌన్సిలర్‌లు చింతల నాగిరెడ్డి, మధు, వైఎస్సార్‌సీపీ నాయకులు గూని నాగరాజు, దస్తగిరి, సలీమ్, ఖాజా, ఎద్దులన్న, డక్కి శేఖర్, యాకోబ్, వలీబాషా, మహేష్, పట్టణ, మండల సచివాలయ కన్వీనర్లు తిరుమలేశ్వర్‌రెడ్డి, అజామ్ బాషా తదితరులు పాల్గొన్నారు.